# 3

"గుంటూరు వెళ్లి పండక్కి అక్కయ్యనీ బావనీ పిలుచుకొస్తా వట్రా?" అని మా నాన్న నన్నడగగానే, ఎందుకో, వల్లమాలిన ఆనందమయిపోయింది నాకు లోపల; తక్షణం సరే నన్నాను. దానికి కారణం లేకపోలేదు.

గుంటూరు నాకు కొత్త. మా అక్కయ్య పెళ్లికి గావును ఒక్కసారి వెళ్లాను; దరిమిలా పరీక్షలమూలాన్న వీలుచిక్కలేదు.

అయితే, గుంటూరులో చక్కని చుక్కలున్నారనీ, అక్కడ ఏరకానికారకం సులభంగా అందుబాటులో వుంటుందనీ, మొత్తంమీద అక్కడ జల్సా వేరనీ, ఏవేవో వూహాలు పైకివిడమర్చి చెప్పాలనిపించేవీ, చెబితే పిచ్చిపిచ్చిగా తేలిపోయి కనిపించేవీ, అస్పష్టంగా, అంచేత ఆకర్షవంతంగా, మెదట్లో, ఎక్కడో, లోతుగా పాతుకుపోయి, ఎన్నాళ్లనించో అట్టడుగున వుండిపోయినట్టు అనుమానముంది నాకు. మరి ఈభోగట్టా అడపాతడపా మాశంకరంగాడి సొంతడబ్బా వాయింపుల్లో వూడిపడిందీ, లేకపోతే, కాకినాడ గణపతి

నవరాత్రుల్లోనూ, రాజమండ్రిలో శ్రీరామనవమి పందిళ్ళకిందా, ఆచంటలో శివరాత్రి వుత్సవాల సందట్లోనూ చూచిన అంతులేని మేళాలలో, కళ్లుకట్టిన అందాల తూకంలో, మోజు కాస్త ఏమైనా గుంటూరు సీమవైపు మొగ్గుచూపిందేమో నేను మాత్రం చెప్పలేను.

అక్కడికీ అతిజాగ్రత్తగా ప్రయాణానికి అరేంజిమెంట్లు చేసుకున్నాను; దాని పుణ్యమా అంటూ మధ్యాన్న మొక ప్యాసింజరుంది; దానిమీద ప్రయాణం సాగించాను; సాయంత్రం అయిదింటికల్లా గుంటూరు చేరుకున్నాను.

ఇంటిదగ్గర ముందుగానే మాబావగారి ఎడ్రసూ, వీధిపేరూ, ఇంటినంబరూ గట్రా జాగ్రత్తగా ఒకచీటీమీద వ్రాసుకుని, భద్రంగా మడిచిపెట్టి, మనీపర్సులో వేసుకునే బయల్దేరాననుకోండి. ఆపూటకి ఏహోటలులో నైనా లక్షణంగా భోజనాదికాలు నివర్తించుకుని రాత్రికి ఎక్కడనైనా ఖులాసాగా కాలక్షేపంచేసి, ఉదయం సావకాశంగా మా అక్కయ్యగారింటికి వెడదామని బుద్ధిపుట్టింది. ప్రొద్దుట మా వూరునించీ గుంటూరు చేరుకునే బండీ ఒకటి సరిగ్గా ఆరున్నరకుంది.

సరాసరి ఏడింటికల్లా మావాళ్ళ ఇంటికి చక్కా వెడితినా, ఉదయం ప్యాసింజర్లో దిగినట్టు ఖణాయించి బుకాయించవచ్చు. యం. యస్. యమ్. వాళ్లు పెట్టిన ఈ బళ్ళ రాకపోకల అరేంజిమెంట్లూ అవీనూ, ఎంత రసికజనానుకూలంగా వున్నాయీ, అని మురిశాను కూడా.

అసలు ఇలాంటి డిటెయిల్స్ లో దొరికే అలవాటు లేదు లెండి నాకు. ఉదయం వెళ్లేటప్పుడు కాలిబాటుమీద రోడ్డుదుమ్ము కొంచెం చిక్కగా అలుముకుని వుండేట్టు చూచుకోవాలి; క్రాపు రవ్వంత చెరిగిపోయి కనపడాలి; అంతేగాని, అప్పుడే టాయిలెట్టు ముగించుకుని, పడకగదిలోనించి బయటికొచ్చినట్టు అహార్రించగూడదు; ప్రయాణపు బడలికా, చికాకూ, నటించాలి; స్నానానికి తొందరపడాలి; వున్నాయిగా... అందులోనూ, మా అక్కయ్య అసలే ఆవలిస్తే పేగులేమిటి, నరాలుకూడా లెక్క పెడుతుంది. నాకు తెలియదూ?

రిక్షావాణ్ణి పిలిస్తే వచ్చి "ఎక్కడికండి బాబూ?" అంటున్నాడు. ఓ పావలా డబ్బులు చేతులో పెట్టి చిన్నినవ్వు నవ్వాను. అంతా అర్థమైపోయింది వాడికి. వాళ్లు ఈ మాదిరి మూగభాషలో నిధులంటే నమ్మండి.

ఇక మేఘాలమీద రిక్షా వెళ్తోంది! మెయిన్ రోడ్డు తప్పించి, పక్కసందులలోకీ, ఇరుకుగల్లీలలోకీ, ఎన్ని మలుపులు తిరిగామో లెఖ్ఖలేదు; అది ఏపేటో, ఏసందో, గుర్తులేదు

ఆ డాబామీద చలవపందిరిమీదకి సన్నజాజితీగ ఎక్కిస్తున్న అప్సరస ఎవరది! రిక్షా దూరాన్నే ఆపుజేయించి వెయ్యికళ్లుచేసుకుని చూచాను. నిజంగా ఏ పర్షియన్ బ్యూటీయో ననిపించింది. నాచూపులు కండపుష్టిగా బలిసిన ఆ మెడవొంపులమీద మూర్ఛలు పోతున్నాయి. చిక్కని ఎఱుపులోకి దిగని సాయంకాలపు పచ్చని నీరెండజాడలు ఆ అమ్మాయి చెవులమీదనించీ చంపలనునుపుమీదకి దిగజారే మెత్తనిజుట్టు వంకీలలో బంగారపుగూళ్లు కట్టుకుంటున్నాయి. రాబోయే రాత్రికి చేసుకున్న ముస్తాబో ఏమో, ఆసౌందర్యం నిర్మలమైన నీలాకాశపు బాక్‌గ్రవుండ్‌లో క్రిందనేలమీద దుమ్మూ, చెత్తా, చెదారమూ, వాసనా, కంపూ, వీటన్నిటికీ దూరంగా, అతీతంగా నిలబడి, కళ్ళకి ఎంతో శుభ్రంగా, కడిగిన ముత్యంలా, కత్తిరించిన క్రోటన్ మొక్కలా... నాకు మతిపోయింది....ఏమిటిది త్రోవలో?—ఎవరైనా చూస్తే?......

రిక్షావాడు నేను చెప్పకండానే కనుక్కొని చక్కా వచ్చాడు: హనుమంతుడులాంటివాడు లెండి.

పేరు లైలా అట. ఎంతచక్కని పేరు! కొంతమందికి పేరు మనిషికి తగ్గట్టు, అమిరి చక్కా పూరుకుంటుంది. ఎమ్యూజుమెంటు పార్కుల్లో డాన్సింగు చేస్తుందిట; గుంటూర్లో నిలకడగా వుండదట; మర్నాడు ప్రొద్దుట మళ్లీ నైజాం వెళ్లిపోతుందట.

"రేటు పాలికండి బాబూ."

నాగుండె ఆగింది. పర్సంతా ఖాళీ అయ్యేటట్టుందే ......తల తడుముకున్నాను. ఏమిచేస్తాం? తప్పుతుంది గనకనా - ఈ యుద్ధమొకటొచ్చిపడింది - అన్నిటికీ ధరలు పెరిగి కూచోలే?

"చూడు - ఒకేయ్ - రాత్రి 9½ కి - అయిదు రూపాయలు బజానా ఇచ్చిరా." అడక్కపోయినా ఇచ్చిరమ్మన్నాను. నేను మాటతప్పుతానేమోనని ఆపిల్లకి అపనమ్మకముంటుందని కాదు; రాత్రికి ఆపిట్ట నాచేతిలోనించీ జారిపోకుండా, వొక మోరల్ బైండింగ్‌లో పెట్టేదామని నాకట్టుదిట్టం నాది. ఆలావణ్యాంముంపుకిఒకసరసుడిగామాత్రమే వెళ్లాలిగాని, రేటు మాట్లాడడమూ, సెటిల్ చేసుకోవడమూ,

ఎడ్వాన్సు చెల్లించడమూ, - ఆ బేరాల తదంగమూ, అదీ - అబ్బ, నేను భరించలేను - చెప్పొద్దూ, ఒక బిజినెస్ మేన్ రోల్‌లో ఆఅందంముందు నిలబడితే, నారోషాన్ని గాయపడుతుంది.

“మిా అదృష్టం బాబయ్యా- ఈ బస్తీమొత్తానికిలాంటి సక్కనిసుక్క లేదంటే నమ్మండి(వాడి సర్టిఫికేట్‌కి ప్రత్యేకమైన విలువ ఇవ్వాలిమరి) - ఎల్లట్రీలాంటి పిల్లండి - ఈరాత్రిగాని దాటితే మరి... ...”రిక్షావాడు - తిరిగివచ్చి ఏమిటో అంటున్నాడు-ప్రతివాడికీ, ఎక్కడో లోతుగా, పిసరంత కవిత్వం ఉండితీరుతుందంటే నవ్వుతాము మనం.

“ఒరేయ్ - ఇంత చమక్కైన పిల్లకి ఈ బ్లాకవుట్ రోజుల్లో ఎలక్ట్రిక్ లైటుతో పోలికలు తీసుకురాకు – చూడు – ఇదేవిధి ?” ఓ అర్ధరూపాయి వాడిచేతులో పెట్టి,పర్సులో మావాళ్ల ఇంటి ఎడ్రసు వ్రాసివుంచుకున్న చీటి తీసి, దాని వెనకప్రక్క వ్రాసుకుంటున్నాను. పైనించీ ఆగంధర్వకన్య ఓరకంట చూస్తోంది. నాకు తెలియకండానే, రక్తంలో ఏదో తియ్యని పరిమళం పాకుతోంది

శ్రోవమధ్య నోటుబుక్కు తీసినట్టు మనీపర్సు విప్పడమూ – పెన్సిలుతో మార్కు చేసుకోవడమూ – పోలీసులంపటమనుకుంటుందో ఏమో వెధవగోల – అలా అనుకోగూడదుమరి – ఎడ్వాన్సు ఎదురుతీసుకో లేదుగా నేను...

వెళ్లిపోయాను – ఒక్క చూపు అలా మీటి.

రాత్రి ఉడిపిహోటలులో భోంచేశి, లక్నో జరదా మిఠాకిళ్ళీ బనాయించి, ఆరాత్రికి మేడమీద ఓగది అద్దెకుతీసుకుని, నాసూటుకేసు గట్టా అందులో పారేశి, బూటుకి కొంచెం పాలిష్ తగిలించి, తలకి గుల్ షబ్ హెయిరాయిలు పట్టించి, నేవీ బ్లూకోటూ, బ్యాటరీలైటూ, వేళ్లసందున త్రికాజిల్స్ సిగరెట్టూ నేనూ తయారై, ఓ రిక్షావాణ్ణి పిలిచాను.

అసలీ రిక్షావాళ్లు ప్రబంధయుగంలో మాయలు నేర్చిన దూతికలో, మాటలునేర్చిన రాజహంసలో అయివుంటారు ; ఖర్మంకాలి, ఈయుగంలో ఆడరికంచెడి, రెక్కలు తెగి ఈదుమ్ములో ... ...

“ఎక్కడికండి బాబూ ?”

పర్సులో చీటీ చూచి చెప్పాను.

“చాత్రావీధి - నంబరు 25”

ఎవరైనా వింటున్నారో ఏమిటో — మన సన్నాహమంతా బోగంవీథికని అందరికీ తెలియాలనా ఏం?

రిక్షా సాగిపోతోంది. ఈ బ్లాక్అవుటువల్ల ప్రజలకి జపానువాడి విమానదాడిబాధ తప్పిందో లేదోకాని, సానివాడలో చల్లగా అడుగుపెట్టేవాళ్లకి, ఎగాదిగా విడ్డూరంగా చూచే వెకిలిమొహాల ఇబ్బందిమాత్రం చాలావరకు తప్పిందనే చెప్పాలి.

వీథులన్నీ మాటుమణిగాయి. గుంటూరికి మాత్రం సందుల ఇరకాటానికి అగ్రతాంబూల మివ్వాలిసిందే. పగలంతా రేగినదుమ్ము అప్పుడప్పుడే అణుగుతోంది, రిక్షావాడి వొంటిమీదా, నానేవీబ్లూకోటుమీద గూడా. ఆచెత్తకుండీల మధ్యనించీ, సైడుకాలవల మురికిమీదనించీ, (ఆకాలవలో రిక్షాటైరు ఎప్పుడు పడుతుందోనని ఘడీఘడీకీ అనుమానమే నాకు) — అటూఇటూ వాల్ పేపర్లమీద సినీమాస్టార్లకి కొంటెకోణంగులు తగిలించిన బుగ్గమీసాల మెలికలలోనించీ, అబ్బబ్బ! భరించలేను...... కాని, ఏమిచెయ్యను? నేను వెళ్లబోయే స్వర్గసీమకి — ఇవి దిద్దితీర్చిన పూలబాటలు! పన్నీరుజల్లిన పావంచాలు!!

పది నిమషాలలో చేరుకున్నాము - అదే ఆవత్తరుగుల ఇల్లు - రిక్షా ఎక్కేముందు ఇంటినంబరు కూడా గట్టిగా జ్ఞాపకం పెట్టుకున్నాను లెండి, లేకపోతే, తీరామోసి, ఏ చెత్తాకానీముండ ఇంటోకో జొరబడగలను.

ఠీవిగా వెళ్లి హాల్లో ఈజీఛెయిరులో కూచుని ఎదురుచూస్తున్నాను. ఎవరో ఒక కుర్రాడు తుర్రున లోపలికి పరిగెత్తాడు, బావ బావంటూ - ఓరాత్రి సంబంధానికి - అప్పుడే - గుంటవెధవాయి ! - తెల్లారితే సరి నాచెవినించీ తీసి మరోహాడిచెవికి తగిలించాల్సిన తియ్యాని వరసలూ, వావులూ......

గుమ్మందగ్గిర అలికిడి—

“తమ్ముడూ - కాళ్లు కడుక్కో.”

గిరుక్కున తిరిగిచూచాను

మా అక్కయ్య !!!

ఇదేమిటి ?

లోపల చైతన్యమంతా వొక్కసారిగా దిగజారిపోయింది. నా తెలివి తెల్లవారితే.........

చీటీ మళ్ళీ పరీక్షగా చూచుకున్నాను.

నా శ్రాద్ధంలావుంది! చీటీకి ఎటువైపున ఏ ఎడ్రసు వ్రాసుకుని తగలడిందీ ఇప్పటికీ గుర్తులేదు.

ఇక ఖంగారెక్కువయింది. తుడుచుకోడానికి తువాల ఇచ్చి మా అక్కయ్య నఖశిఖపర్యంతమూ తేరిపారజూచింది. ఇంకేముంది? కనిపెట్టేశే వుంటుంది. రైలుదిగివొచ్చిన ఆసామీ లక్షణ మొకటైనా వుంటేనా మొహాన్ని!

అన్నన్నా! అసలాపిల్లని చూచినప్పుడైనా, ఆ పందేమిటో, దానివాలకమేమిటో, ఆ పరిసరాలెలా వున్నాయో, పల్లకాడో, పశనపురమో, ఆ 'టోపోగ్రఫీ' ఏమైనా కాస్త చూచుకుని గుర్తుంచుకుంటేనా? దాని చంపల నునుపూ, వాలుజడలో పువ్వుల తళుకూ చూడటంతోటే సరిపాయె!

ఇహానేముంది; కొంప మునిగింది! మా అక్కయ్య అసలూరుకోదు; మా నాన్నతో ఎలాగూ చెప్పక మానదు; మానాన్న అసలే చండశాసనుడు; ఆయనకి మా అక్కయ్య మాటంటే ఎక్కువ గురికూడాను. ఇలాంటి ఆచోకీగాని చెవికి సోకిందీ అంటే చర్మమొలుస్తాడు; ఇహా ఈదెబ్బతోటి కాకినాడ దూర్వాసుల్లా వొచ్చిపడతాడు. మా లాడ్జిలో శంకరం

గాడితో ఆయన మాట్లాడడం కలిగిందా, ఇక చెప్పనక్కర్లేదు. నా అటెండెన్సు సంగతీ, పక్కఇంటో నాయుళ్ళపిల్లతో సంబంధమూ గట్రా — మొన్న కాలేజీ గరల్స్‌హాస్టల్లో పిట్టగోడ దాటుతుండంగా నేను దొరికినప్పుడయిన అల్లరీ...... ఒకటేమిటి? — అన్నీ ఏకరువుపెట్టేస్తాడు; వాడికి మొట్టమొదటినించీ ఏడుపు వున్నదే ఆయెను-నేనంటే-వాడితో మాట్లాడడందాకా ఎందుకూ? వాడి డయరీ చూస్తే చాలు - అసలు వాడు డయరీ అంటూ తెరుస్తా, నా బయాగ్రఫీకోసమేనని వొకగట్టినమ్మకం నాకు.

కాళ్లు కడుక్కుంటోవుంటే మా అక్కయ్య చూస్తూ అలాగే నిలబడిపోయింది. - అయ్యవొ్యా! ఈ దిక్కుమాలిన లెవెండరువాసనా, గుల్‌షబ్ హెయిరాయిలు పరిమళమూ - వీటి గుమాయింపు ఆపుజెయ్య లేకుండా వున్నానుగదా!!

"చెల్లాయి ఆడుకొంటో వుందట్రా?"

అమ్మయ్య! పేచీలేని ప్రశ్న.

కాని నేను ఎంతనిబ్బరంగా వుందామన్నా, నాచూపుల్లోకీ, నా చేష్టలలోకీ, దొంగతనం నాకు

తెలీకండానే ఎప్పుడు ప్రవేశించిందో ఏమో, చేతులికి అరదండాలు వేశి నిలబెడుతోంది.

"ఏమిట్రా ఆవేషమూ అదీను ? దొరగారు ఏ బండిలో దిగినట్టిప్పుడు? "

పచ్చివెలక్కాయి గొంతుకడ్డంపడింది.

ఈ వెధవఖంగారులో అసలు మెదడు ఖాళీ అయిపోయింది. ఇప్పుడు రైలుబండి ఏదయినా అహారించిందో లేదో తెలియదాయెను. ఎప్పుడు దిగినట్టు చెప్పడం ? తెలివితక్కువ నాగమ్మని, గుంటూరికి వొచ్చేపోయే రైళ్ళజాబితా కంఠస్తమైనా చేశానుగాను. ఇప్పుడెలా ?

సాయింత్రం అయిదుగంటలబండీ కొచ్చాననీ, కాలేజీహాస్టలులో వోస్నేహితుడి బలవంతాన్ని అక్కడ భోంచెయ్యాలిసివచ్చిందనీ బొంకేశాను, అన్నిటికీ అతికేలా.

వేసిన పతకం బాగానే పారింది.

డాబామీద పక్కలువేశారు. ఈ ఇంటికి కూడా వో డాబావుంది; అదేకొంపముంచింది.

లైలా మళ్లీ జ్ఞాపకానికొచ్చింది. కాలమూ ఖర్మమూ తప్పిఇలాతగలడకపోతే, ఆరాత్రికి నాచేతులలో

నలిగిపోవలిసివున్న అందం !! ఆధ్యాసలో మళ్లీ మనస్సు రెపరెపలాడుతోంది.

ఏసినీమాకనో శలాయిస్తే ?

మా బావతమ్ముడు వెంకటేశం, నిక్షేపరాయుడు, సైంధవుళ్లా అడ్డుపడ్డాడు. రెండో ఆట లేదట, యుద్ధం అడావుడి మూలాన్ని. ఈయుద్ధమూ నాకోసమే వొచ్చినట్టుంది !

నెత్తురు పగ్గాలు తెంచుకొని ప్రవహిస్తోంది.

స్నేహితుడు ప్రొద్దుట బండిలో వెళ్లిపోతాడనీ, వాడిదగ్గర కొన్నిపుస్తకాలు తీసుకోవాలనీ, గబగబా అల్లిపారేశాను. స్నేహితుడెవరని నిగ్గతీశాడు;...సరె,— అసలు మొదటికొచ్చేలావుంది.

ఈఅబద్ధమనేది వున్నదే, అది వస్తుతః పుటకలోనే పొట్టకాలేసుకుని బయలుదేరుతుందంటే నమ్మండి. రవంతసేపైనా స్థిరంగా నిలబడగల శక్తి దానికి మహాతక్కువ. ఒక్కొక్క అబద్ధానికి ఒకవందఅబద్ధాలు బోటుపెట్టాలి. ఇంతజేసినా అవన్నీ అతికిచావక మొట్టమొదట చెప్పిన అబద్ధం ఏదోవొకవైపుకి వొరుగుతోనే వుంటుంది.

మా అక్కయ్య చురచురచూశింది.

అందరికీ పరీక్షలాయెను; మావాడు ఫ్యారికి వెళుతున్నాడూ అంటే నమ్మేదెవరు ? నాకంటె సెప్టెంబరు ఛాన్సుగాబట్టి సరిపోయింది.

ఇక కళ్లుమూసుకున్నాను. మళ్లీ రైలా ! అయ్యయ్యో ! ఎంత చక్కని రూపురేఖలు !! అజంతా విగ్రహాలలోనే చూచాను ఆ అవయవాల పొంకం; ఆ చక్కదనమంతా, ఈ కాలవాహినిలో నాలుగు గడియలే అనుకోండి, ఆరాత్రికి నాదినాదని పడ్డ బులపాటమంతా నష్టేట గలిసినట్టేనా ? మళ్లీ ఎప్పటికైనా......? తెల్లవారితే నైజాంస్పెషల్ ట్రెయిను ఎక్కేస్తుందాయెను ! మళ్లీ ఎన్నాళ్ల కొస్తుందో? ఎప్పుడొస్తుందో ? వొస్తేమాత్రం ఈయావనపు మిసమిసలూ, ఇప్పటి సౌందర్యపుజిగీ అప్పుడుంటాయని ఏమిటి ? మళ్లీ ఎన్ని చేతుల్లో నలుగుడుపడి నావ్రేళ్లోకి రాలుతుందో ఆపుష్ప !!

ఇక ఎలాగూ వెళ్లడం పడదని స్థిరమయిపోయిం తరవాత, ఆసాయింత్రం చూచిన అందం రెండింతలై కనిపిస్తోంది. ఏమిచెయ్యను ?

ఆగలభా ఏమిటో ? ఆచిన్నాడు - మాబావ అన్నగారి కొడుకుగావును - ఆరేళ్ల కుర్రకుంక - వాడంటే

నాకు చెడ్డభయంగావుంది. వాడికి పుస్తకాలంటే మహాప్రీతిలా అవుపిస్తోంది. నాకోటు జేబులోనించీ పైకి తొంగిచూస్తున్న 'సెక్స్‌పిక్టోరియల్' గాని వాడిచేతులో పడిందా - లోపల నగ్నచిత్రాలూ, దిగంబరదృశ్యాలూ అవీ - నలుగురు పిల్లకాయలనీ చేర్చి వో చిన్నఎగ్జిబిషన్ గాని తెరిచాడా, ఇంక నారహాస్యానికి కాస్తా లంకాదహనమయి చక్కా పూరుకుంటుంది. ఆజేబులో ప్రమాదకరమైన సరంజాం చాలావుంది. వాడు నాకోటుజేబుమీదకి దండయాత్ర సాగించక క్రితమే ఏ Scorched Earth Policy అయినా అమలుపరచకపోతే.........

పక్కని షావుకారు మేడలో రేడియోగా వును మెడ్రాసు మార్కెట్టు ధరలు ఏకరువు పెడుతోంది. అది అయింతర్వాత సూర్యకుమారి పాడబోతుంటే పీకనొక్కి ఆపుజేసి, ఇహ పక్క సర్దుకుంటున్నాడా గృహస్థు.

మాబావ నాపక్కనే పడుకున్నాడు 'సెంట్రి'లాగ. కొత్తగా ప్రాక్టీసు పెట్టాడులెండి - సివిల్ కోర్టులోని - పాతచింతకాయపచ్చడిమాటలు - వొకటే పూదర, ఊకొడుతున్నానా లేదా అనే ధ్యాసకూడా లేదాయనికి.

పక్క గదిలో మాబావ రెండో తమ్ముడు రాము - ఘీష్ఘారం వెలిగిస్తున్నాడులెండి - పంచతంత్రం భట్టీవేస్తున్నాడు - ప్రశ్నలూ సమాధానాలూనట. "దేనివలన ఎవరెవరు కలుసుకొందురు? దేనివలన ఎవరెవరు కలుసుకొందురు? చిత్రకేతుడనే కపోతరాజు......" హోరెత్తించేస్తున్నాడు...... వీళ్ళచదువులు చట్టుబండలుగాను - ప్రశ్నలు గూడా కంఠస్తమెంకుకో?

గుండెకాయమీద సుత్తిదెబ్బల్లాతగులుతున్నాయి, ఈచుట్టుపక్కల అలికిడీ గోలా అంతా.

గంటలు వినబడుతూనే వున్నాయి – రకరకాల సందడి - అంతా అలుముకుపోయి మెదట్లో మసక మసగ్గావుంది.

ఉద్రేకంతో ఒక్కసారి మంచం దిగాను.

ఏడీ? పక్కని మాబావ లేడే?

డాబామెట్లు నిశ్శబ్దంగా దిగాను.

వీధితలుపులు వోరగా తెరిచివున్నాయి. ఇదేమిటి? బయటికి చల్లగా అడుగుపెట్టాను. ముడుచుకునే కలవపూవు రేకుల్లా తలుపులు అతి నాజూకుగా వాటంతట అవే అనాయాసంగా

మూసుకున్నాయి. స్ప్రింగ్ అరేంజిమెంటుగాని ఏమైనా వున్నదా అనే ఆలోచన పట్టలేదప్పుడు నాకు.

తిన్నగా నడిచివెళ్లి రెక్కలు మొలిచినట్టు వాలాను ఆ యింటో. చీటీ చూడాలిసిన అవసరం లేకండానే ఇల్లు దొరికింది తమాషాగా. లోపల పరుపుమీద సన్నజాజిపువ్వులు సగం వాడిపోయి కునికిపాట్లు పడుతున్నాయి. మంచంపక్కని (Mahagony Rocking Chair) మహాగనీరాకింగ్ ఛెయిర్ లో కూచుని, టేబిలు మీద చైనావేజ్ పక్కని తలానించి నిదరపోతోంది లైలా! నాలైలా!! నాకోసమని చూచిచూచి సొక్కి సోలి నిదరబోతోంది- పాపం! నాకోసమే? జలిసిపోయిన ఆకళ్లమీద ఒక చిన్న తేలికముద్దుపెట్టుకుని, ముసిరిన మాగన్నునిద్రని అతి సున్నితంగా తుడిచేదామనిపించింది. కాని, రింగు రింగుల ఫ్రిల్లులలో పిటపిటలాడుతున్న దండలకెగువని, మజిలిను జంపరు పలకల కత్తిరింపుల్లో ఇమడక, రెండు పాయలుగా విడిపోతున్న ఆవున్నతమైన వక్షస్సు వుబుకు... ...ఇక శరీరం ఎదురుతిరుగుతోంది. రక్తంలో వెయ్యికోరడాలు ఒక్కసారిగా ఛెళ్ళుమన్నాయి. అమాంతంగాకావిలించుకుని మెడమీదా, నొసలుమీదా,

దొరికినచోటల్లా, చక చక చక, కసితీరా ముద్దులు పెట్టేసుకున్నాను. వాలుజడలో పూలచెండు పక్కున నవ్వింది.

"ఏమిటోయి - కలవరింతలూ నువ్వూను?" అంటున్నాడు మా బావ.

చూసుకుంటే మంచమ్మీద పరుపూ, క్రింద నేనూ తలగడా!

నేనుపడ్డ అలికిడి అలారం కింద పనిచేసిందో ఏమో, పక్కగదిలో కునిపాట్లు పడుతున్న రాము - (అది తెల్లారగట్ట గావును) ఉలిక్కిపడిలేచి, దేనివల్ల ఎవరెవరు కలుసుకుంటారో మళ్లీ ఖచ్చితంగా వల్లె వెయ్యడం లంకించుకున్నాడు. వీడొక శకునిపక్షి నాకు ?

పూచుపుచ్చుకుని లెంపకాయ కొడదామనిపించింది.

కాని ఎవరిమీద కోపం ?

## *** "అనుకోని విరహం" ***